క్లుప్తంగా

రోడ్డును సరిచేయండి సారూ !



మధురానగర్(విజయవాడసెంట్రల్):నిత్యం రద్దీగా ఉండే జీవీఆర్‌నగర్ మెయిన్ రోడ్డును ఇటీవల ఓపెన్ డ్రెయిన్ పనులలో భాగంగా మురుగును బుడమేరులోకి తరలించేందుకు రోడ్డును తవ్వి పైపులు వేశారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ తవ్విన తారు రోడ్డును మాత్రం సరిచేయలేదు. దీంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో తరచూ పలువురు గుంతలలో పడి గాయాల బారిన పడుతున్నారు. అలాగే వేగంగా వచ్చిన వాహన చోదకులు ఒక్కసారిగా గుంతల వల్ల డిస్క్ సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డును తవ్వి పైపులు వేయటం మీద చూపించిన శ్రద్ధ కాంట్రాక్టర్ రోడ్డును సరిచేయటంలో చూపించకపోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే రోడ్డును తవ్విన వారు వెంటనే సరిచేసేలా కాంట్రాక్టర్‌లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వాడాలి

రామవరప్పాడు: రైతులు నేల పరీక్ష ఆధారిత ఎరువులు వినియోగం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ శివప్రసాద్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్-2025 ప్రీ ఖరీఫ్ కార్యాచరణలో భాగంగా ఎనికేపాడులో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గూడవల్లిలో శాస్త్రవేత్త కిషోర్ వర్మ, నిడమానూరులో డీఏవో విజయకుమారి, ఏడీఏ వెంకటేశ్వరరావు, శాస్త్రవేత్త రాజశేఖర్ రెడ్డి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలల్లో డాక్టర్ మహేష్, కేవీ చౌదరి, కేవీకే శాస్త్రవేత్త లక్ష్మి కళ, రాజప్ప, వ్యవసాయ శాఖ అధికారి రంగనాథ్ బాబు, పశుసంవర్ధక శాఖ అధికారి లక్ష్మి ప్రసన్న, టి.జశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామస్వామివారి దేవస్థానంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 150 మంది మహిళా భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. మూల మంత్రహోమం, స్వామివారికి పుష్పాలు సమర్పించారు. నూతన విగ్రహాలకు క్షీరాధివాసం చేశారు. ఆదివారం ఆలయంలో ఉదయం 7.45 గంటలకు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా చేయనున్నారు. శ్రీసీతారామచంద్రస్వామి, దాసాంజనేయ సిద్ధి గణపతి సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. శిఖర ప్రతిష్ఠ చేసి శాంతికల్యాణం చేస్తారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి తెలిపారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

పెనమలూరు: పోరంకి గ్రామం లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామివారి తిరు కల్యాణమహోత్సవం ఘనంగా చేశారు. ఆలయంలో ఉదయం సువర్ణ పుష్పార్చన, తిరుప్పావడ సేవ, సామూహిక విష్ణు సహస్రనామపారాయణ పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో రాత్రి త్రిదిండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో శ్రీవారి తిరు కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. కాగా ఆదివారం ఆలయంలో భక్తులకు అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

రేపు ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో ఈనెల 9వ తేదీన ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు విగ్రహం కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విగ్రహ కమిటీ ప్రతినిధులు పిన్నం వెంగళరావు, నోముల రఘు, పబ్బతి నరేంద్ర, సంకా భాస్కర్, రవి చంద్ మాట్లాడుతూ పట్టణంలోని విజయవాడ రోడ్‌లో 11అడుగుల ఎత్తులో ఛత్రపతి శివాజీ మహరాజ్ 13అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి చాముండేశ్వరి పీఠాధిపతులు శ్రీకమలానంద భారతి స్వామి, శైవక్షేత్ర పీఠాధిపతులు శ్రీశివస్వామి, గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ శ్రీరాం భరత్‌కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తదితరులు పాల్గొంటారన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి!

- వారం రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- రోడ్డుపైకి రావాలంటేనే హడలిపోతున్న నగరవాసులు
- నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు







నిర్మానుష్యంగా మారిన బీఆర్టీఎస్, మధురానగర్ వీవీనరసరాజు, దావుబుచ్చయ్యకాలనీ ప్రాంతాల్లో రహదారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మే నెల వేసవి ఎండలు అంతంతమాత్రంగానే ఉండటంతో ఊరట చెందిన నగరవాసుల ఆనందం ఎంతో కాలం నిలవలేదు. గత నెలలో ప్రతి రోజూ వర్షం పడటంతో అసలు వేసవి తీవ్రత లేకుండానే వేసవి కాలం ముగిసిందని సంబరపడ్డారు. ఇంతలో వాతావరణ శాఖ నైరుతి రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని ప్రకటించటంతో ఇక ఈ సంవత్సరం వేసవి ముగిసినట్లేనని అందరూ భావించారు. కానీ జూన్ ప్రారంభం నుంచి భానుడి ప్రతాపం చూపించటంతో జనం ఉక్కిరిబిక్కిరికి గురవుతున్నారు. భానుడి తాపం తట్టుకోలేక నగరవాసులు విలవిల్లాడుతున్నారు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరిగిపోతోంది. దీనికి తోడు ఉక్కపోత పెరగటంతో రోడ్డుపైకి రావాలంటేనే హడలిపోతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉంటుంది. సాయంత్రం ఆరున్నర గంటల వరకు భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. ఎండకు తోడు వెచ్చటి వడగాలులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక శనివారం అయితే భానుడు మరింత ఉగ్రరూపం దాల్చటంతో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పనులపై బయటకు వెళ్లేవారు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అవకాశం ఉన్నవారు ఏసీ రూమ్‌లకే పరిమితం అవుతుండగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు ఫ్యాన్‌లు, కూలర్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎండలు తగ్గుముఖం పట్టాయని పలు చోట్ల చలివేంద్రాలను సైతం మూసివేశారు. దీంతో పాదచారులు, వాహన చోదకులు తాగునీటికి సైతం ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

విద్యుత్ కోతలతో మరింత ఇబ్బందులు.....

అలాగే ఒక పక్క ఎండవేడి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు అప్రకటిత విద్యుత్ కోతలు మరింత కలవరపెడుతున్నాయి. అసలే ఇరుకుగదులలో జీవనం సాగిస్తున్న పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు ఉక్కపోతను తట్టుకోలేక బయటకు రాలేక నరక యాతన అనుభవిస్తున్నారు. ఇక కష్టాలు ఎన్ని రోజులు ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉక్కపోత వల్ల కనీసం కడుపు నిండా తినలేకపోవటంతో పాటు కంటి నిండా నిద్ర కూడా కరువయ్యిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు



కేదారేశ్వరపేటలో ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రోడ్డు, డ్రెయిన్, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటే అటువంటి వారిపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని మూడవ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు హెచ్చరించారు. శనివారం కేదారేశ్వరపేటలోని ఫ్రూట్ మార్కెట్, రైతు బజారు ప్రాంతాలలో ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై అనుమతులు లేకుండా నిలిపిన తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లు, డ్రెయిన్లపై స్థిరంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలు, రోడ్డుమీదే ఎగుమతి, దిగుమతి చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాల యాజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన రెండు బొలెరో వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ వాహనదారులు, వ్యాపారులు తమ వ్యాపార సంబంధిత వస్తువులను తమకు కేటాయించిన ప్రదేశాల్లోనే ఉంచుకోవాలని, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలపడం వలన సాధారణ ప్రజలకు, అత్యవసర వాహనాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. మార్కెట్ గేట్ల వద్ద వాహనాలను పార్క్ చేయడం వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని, అటువంటి వాహనదారులు కొంత దూరంలో పార్క్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి డ్రైవ్‌లు ప్రతిరోజూ జరుగుతాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అలరించిన ఆపాత మధురాలు



ప్రతినిధులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: గంగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన ఆపాత మధురాల సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. గాయనీ గాయకులు సింధూ, రజని, మల్లీశ్వరి, కృష్ణకుమారి, వేణుగోవింద్ తదితరులు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు. గంగా ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకుడు గంగాధర్ మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు పేద కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమ కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్ రాజు, బీవీ వీరభద్రరావు, ఆదిరాల జయప్రభ పాల్గొన్నారు. గాయనీ గాయకులను, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

● ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయం !



ఆర్‌యూబీ సర్వీసు రోడ్డులో రోడ్డుకన్నా ఎత్తులో ఉన్న మ్యాన్‌హోల్

మధురానగర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డులో లేచి పోయిన కంకర

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ ఆర్‌యూబీకి ఇరువైపులా నిర్మించిన సర్వీసు రోడ్డులో రాళ్లు లేచి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఈ మార్గంలో రాకపోకలు నరకప్రాయంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల వర్షాలకు రాళ్లు పైకి లేచి ప్రమాదకరంగా మారాయి. వాహనాలకు భద్రత కరువయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి రాళ్ల వల్ల తరచూ వాహనాలపై నుంచి జారి పడిపోతున్నామని అంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ఈ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఒక్క పక్క రోడ్డుపై రాళ్లు తేలిపోయి ప్రయాణానికి ఇబ్బందులు పడుతుంటే మరోపక్క ఈ రోడ్డులో మ్యాన్‌హోల్‌రోడ్డు కన్నా ఎత్తులో ఉండి ఇబ్బందికరంగా మారింది. రాత్రి పూట వేగంగా వచ్చిన వాహన చోదకులు మ్యాన్‌హోల్‌ను ఢీ కొట్టి గాయాలపాలవుతున్నారు. పట్టించుకోవాలని ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వచ్చి చూసే వారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డును సరిచేయకపోవటంతో రోడ్డు కన్నా మురుగుకాలువ ఎత్తులో ఉంది. దీంతో చిన్నపాటి వర్షానికే ఇక్కడ వర్షపునీరు నిలిచిపోతుంది. రోడ్డుమీద నిలిచిన వర్షపునీరు ఎండకు ఎండాల్సిందే తప్ప బయటకు పోయే మార్గం లేకపోవటంతో రాకపోకలకు అవస్థ లు పడుతున్నారు.

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు



వేలేరులోని చిన్న మల్లమ్మ కుంట చెరువులో యథేచ్ఛగా సాగుతున్న మట్టి తవ్వకాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులో అక్రమ మట్టి తవ్వకాలకు తెగబడ్డారు. అధికార టీడీపీ అండదండలతో గ్రామంలోని చిన్న మల్లమ్మ కుంట చెరువులో శనివారం పొక్లెయిన్ల సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టి యథేచ్చగా ట్రాక్టర్లతో తరలించారు. రీ సర్వే నంబర్ 297లో సుమారు 19 ఎకరాల్లో విస్తరించిన చిన్న మల్లమ్మ కుంట చెరువు ఆక్రమణలపై ఇప్పటి హైకోర్టు, లోకాయుక్తాలో కేసులు పెండింగ్‌లో ఉండగా అక్రమార్కులు బేకాతఖరు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులు మొద్దునిద్ర నటించటంతో అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఈ వ్యవహారంపై కొందరు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశానే. సామాజిక మాధ్యమాల్లోనూ పోస్ట్ చేశారు. దీంతో ఎట్టకేలకు రెవెన్యూ యంత్రాంగం కదిలివచ్చింది. క్షేత్రస్థాయిలో వీఆర్వోతో పాటుగా ఇతర అధికారులు చేరుకుని చిన్న మల్లమ్మ కుంట చెరువులో మట్టి తవ్వకాలను తాత్కలికంగా నిలుపుదల చేశారు.

ఎన్‌హెచ్ డ్రెయిన్లలో ముమ్మరంగా పూడికతీత



డ్రెయిన్లలో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది

గన్నవరం: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో చెన్నై- కోల్‌కత్తా జాతీయ రహదారికి ఇరువైపులా డ్రెయిన్లలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) పరిధిలోని ఈ డ్రెయిన్లలో కొన్నేళ్లగా పూడికలు తొలగించడం లేదు. దీంతో డ్రెయిన్లు పూర్తిగా చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. ఫలితంగా మురుగునీటి ప్రవాహం ఎక్కడికక్కడ నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వర్షకాలంలో నీరు జాతీయ రహదారిపైకి చెరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఎన్‌హెచ్ డ్రెయిన్లలో పూడికలు తొలగించేందుకు గ్రామ పంచాయతీ ముందుకువచ్చింది. గ్రామ పంచాయతీ నిధులతో స్థానిక కొత్తపేట నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎన్‌హెచ్ డ్రెయినల్లో సిల్ట్ తొలగిస్తున్నారు. ప్రత్యేక సిబ్బందితో డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదరం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. మరికొన్ని చోట్ల జేసీబీ మిషన్లలో పూడికలు తీస్తున్నారు. తొలగించిన సిల్ట్‌ను ట్రాక్టర్ల ద్వారా గ్రామం వెలుపలికి తరలిస్తున్నారు. వారం రోజులుగా డ్రెయిన్లలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు తెలిపారు. పూర్తిస్థాయిలో పూడిక తొలగించి మురుగునీటిని క్రమబద్ధీకరించనున్నట్లు చెప్పారు.

భక్తురాలిపై వ్యాపారుల దాడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తురాలిపై కొబ్బరి కాయల వ్యాపారాలు చేసేవారు దాడికి పాల్పడిన నేపథ్యంలో వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్‌తో దుర్గగుడి ఈవో శీనానాయక్ శనివారం సమావేశమై చర్చించారు. విజయేశ్వర ఆలయ పరిసరాలు, చైనావాల్, రథం సెంటర్ పరిసరాల్లో ఉన్న ఆక్రమణదారులు భక్తులపై దాడి చేయడాన్ని తీవ్ర చర్యగా భావిస్తున్నామని ఈవో పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలతో ఆలయ ప్రతిష్ఠ, భద్రతకు భంగం కలుగుతోందన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



ముస్లింలతో కలిసి నమాజ్ చేస్తున్న మల్లాది విష్ణు, బొండా ఉమా



సుందరయ్యనగర్ మసీదులో ప్రార్థనలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బక్రీద్ పండుగను పురస్కరించుకుని అజిత్‌సింగ్‌నగర్ ఈద్గా గ్రౌండ్‌లో శనివారం ఇనాం ఈద్గా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన నమాజ్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ.. బక్రీద్ పండగ జరుపుకుంటారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు ఉపాధి అభివృద్ధి అవకాశాలు అధికంగా ఉన్నాయని చెప్పారు. మోసపూరిత చంద్రబాబు వల్ల రాష్ట్రం అదోగతి పాలవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ బాబు, వలీ, జలీల్ ఖబూన్, కరీముల్లా, షేక్ ఆలీ, ఇర్ఫాన్, మస్తాన్, పీర్ బాబు, మాత మహేష్, ఫైజుల్లా తదితరులు పాల్గొన్నారు.

63వ డివిజన్‌లో...

పాయకాపురం(విజయవాడరూరల్): బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం ప్రార్థనలు నిర్వహించారు. 63వ డివిజన్ సుందరయ్య నగర్ మసీద్‌లో జరిగిన ప్రార్థనలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ మస్తాన్, మసీదు కమిటీ పెద్దలు, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇమామ్ మౌలానా షఫీ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకుంటారని చెప్పారు. పండుగ విశిష్టతను తెలియచేశారు. రాజీవ్‌నగర్లోని మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 62వ డివిజన్ ప్రకాష్ నగర్లోని మసీదు, 64వ డివిజన్ కండ్రిక మసీదులోనూ ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పాయకాపురం(విజయవాడరూరల్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం విలేజి కండ్రిక రోడ్డులో 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్లో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 35 వేప మొక్కలు, 35 గానుగ మొక్కలు, 30 పొగడ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు యరగొర్ల శ్రీరాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు, డ్వాక్రా సంఘాల సీవో కిషోర్, యూసీడీ జగదీశ్వరీ, ఆర్‌పీలు, ఎస్‌హెచ్‌జీ మెంబర్లు, పార్క్ సెక్షన్ సూపర్‌వైజర్ విక్టర్ బాబు పాల్గొన్నారు.

అనధికార తరగతుల నిర్వహణపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన



విద్యా సంస్థ వద్ద ఆందోళన చేపట్టిన ఏఐఎస్ఎఫ్

పటమట(విజయవాడతూర్పు):గోల్డెన్ ఐ పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆందోళన చేపట్టింది. బెంజిసర్కిల్ వద్ద గోల్డెన్ ఐ పేరుతో అక్రమంగా తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు శనివారం ఆ సంస్థ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్ మాట్లాడుతూ గోల్డెన్ ఐ అనే పేరుతో అక్రమంగా వేసవి సెలవుల్లో ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇలాంటి విద్యా సంస్థలపై ఇంటర్మీడియెట్ బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పటమట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనను విరమింపచేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధిక్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ జగదీష్ కోశాధికారి సురేష్, నాయకులు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయాలి

పెనమలూరు: కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. పోరంకిలో శనివారం పోరంకి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికులకు అమలు జరుగుతున్న 8 గంటల పని విధానాన్ని కూటమి ప్రభుత్వం మార్పు చేసి 10 గంటలు చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు కార్మికులకు అనేక హామీలు ఇచ్చి నేడు వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 10 గంటల పని విధానం నిలిపి వేయాలని, కార్మికుల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు.

యోగాతో జీవనశైలిలో గొప్ప మార్పులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రతి ఒక్కరూ నిత్యం పది నిమిషాల పాటు యోగా చేయడం వల్ల జీవనశైలిలో వచ్చే గొప్ప మార్పులను గమనించవచ్చని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని మహా మండపం ఆరో అంతస్తులో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా నిపుణులు డాక్టర్ ప్రియదర్శిని, యోగా థెరపిస్ట్ ఎస్.లక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆలయ ఈవో శీనానాయక్, ఈఈ కేవీఎస్ఆర్.కోటేశ్వరరావు, ఏఈవో పి.చంద్రశేఖర్, జంగం శ్రీనివాస్, డాక్టర్ కె.గంగాధర్‌లతో పాటు ఆలయానికి చెందిన సుమారు 300 మంది పాల్గొన్నారు. ఏ హోదా, ఎంత డబ్బు ఉన్నా ఆరోగ్యం లేకుంటే అన్ని వృథానేనని, నేడు ఆధునిక జీవనంతో ఇళ్లలో, కార్యాలయాల్లో శారీరక శ్రమ లేకుండా జీవనం సాగిస్తున్నామన్నారు. దీంతో అనేక వ్యాధులకు గురవుతున్నారని, అవగాహనతో యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. యోగా ద్వారా శరీరానికి ధృఢత్వం, మానసిక స్థిరత, అంతర్గత శాంతి లభిస్తాయని యోగా నిపుణులు పేర్కొన్నారు.

సంప్రదాయ కూచిపూడి నృత్య కళలను కాపాడుకోవాలి



గన్నవరం: కూచిపూడి వంటి సంప్రదాయ నృత్య కళలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. నటరాజ్ డాన్స్ అండ్ మ్యూజిక్ ట్రస్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలను శనివారం స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పాశ్చాత్య పోకడల వల్ల సంప్రదాయ నృత్యాలకు ఆదరణ కొల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. సంప్రదాయ నృత్యాల్లో పిల్లలకు ప్రోత్సాహాన్నిస్తున్న నాటరాజ్ డ్యాన్స్ అకాడమీని ఆయన అభినందించారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత నేటి బాలలపైనే ఉందని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేఎస్.జగదీశ్వరరావు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అకాడమీ చైర్మన్ ప్రసాద్, డాక్టర్ సురేష్, కొల్లూరి దివ్య, డాక్టర్ నిరంజన్, కే విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) : GUDIVADA

E.P.No.2/ 2024
in
O.S.No.282/2005

Between:
1. Yallambhotla Kameswara Rao & 3 others -.D.H.Rs

And

1. Yallambhotla Venkata Suvarchala (Died on 14.07.2020)
2. Konduri Krishna Veni & 5 others - J.D.Rs

To
Dhulipala Kalyani,
W/o. Radha Krishna, Hindu,
aged 41 years, House wife,
D.No. 27-16-32, Plot No.4,
Second Floor, Besant Road,
Governorpeta, Vijayawada. : 5th J.D.R

The above mentioned 5th J.D.R is directed to appear before the above mentioned court at 10.30 A.M on **18.06.2025** either in person or through Advocate. Otherwise case will be decided in her absence.

(By order of court)

Gudivada, Dt.8.6.2025 — **K.Sri Krishna**, Advocate for D.H.Rs.